మాకూ 'స్పెషల్ సప్లిమెంటరీ' చాన్స్ ప్లీజ్!

● జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు 2020-24 బీటెక్ విద్యార్థుల మొర

హైదరాబాద్ సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో కొన్ని పరీక్షలకు హాజరు కాలేకపోయిన తమకు ఒక్కసారి స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని పలువురు బీటెక్ విద్యార్థులు జేఎన్‌టీయూ ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. బుధవారం వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావును 2020-24 బ్యాచ్‌కు చెందిన బీటెక్ విద్యార్థులు కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థులు మాట్లాడుతూ.. ఆర్-18 రెగ్యులేషన్స్ బీటెక్ విద్యార్థులు వారి బ్యాక్‌లాగ్స్‌ను క్లియర్ చేసుకునేందుకు గత మూడేళ్లుగా స్పెషల్ సప్లిమెంటరీ అవకాశాన్ని జేఎన్‌టీయూ ఇచ్చిందని, మా సీనియర్లకు ఇచ్చిన విధంగా తమకూ ఒక్క అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. అనారోగ్య కారణాలతో ఇంటర్నల్ పరీక్షలకు హాజరు కాలేకపోయిన విద్యార్థులు తక్కువ గ్రేడ్‌తో బయటకు వెళ్లాల్సి వస్తోందని, వారికి సీబీటీ(చాయిస్ బేస్డ్ టెస్ట్) విధానం ద్వారా తమ గ్రేడ్‌ను మెరుగు పరుచుకునే చాన్స్ ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. వీలైనంత త్వరగా జేఎన్‌టీయూ అధికారులు తమకు స్పెషల్ సప్లిమెంటరీ నిర్వహిస్తే, తాము ఈ ఏడాది(2024)లోనే బీటెక్ ఉత్తీర్ణులయ్యేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.



చిత్తారమ్మ బస్తీ వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన గడ్డం ఝాన్సీ, చిత్తారమ్మబస్తీ అసోసియేషన్ సభ్యులు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

● జాతీయ దళిత స్త్రీ శక్తి కన్వీనర్, హైకోర్టు న్యాయవాది ఝాన్సీ

బాలానగర్, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాతీయ దళిత స్త్రీ శక్తి కన్వీనర్, హైకోర్టు న్యాయవాది గడ్డం ఝాన్సీ అన్ని వర్గాల ప్రజలకు పిలుపు నిచ్చారు. బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలోని చిత్తారమ్మబస్తీ డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం రహదారి వద్ద చిత్తారమ్మబస్తీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అన్ని వర్గాలు, కులాలు, మతాల కోసం రాసిందేనని అన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన అసోసియేషన్ సభ్యులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శాఖయ్య, సభ్యులు సామియేల్, విజయ్‌భాస్కర్, అంజన్న, అనురాధ, రుక్మిణి, జ్యోతి, శాంతమ్మ, లక్ష్మమ్మ, రాఘవయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.



పేషెంట్ పవన్‌కుమార్‌తో వైద్యులు

తెగిపోయిన చేతిని అతికించిన అపోలో వైద్యులు

● ఈ తరహా శస్త్రచికిత్స తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిది

హైదరాబాద్ సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఓ ప్రమాదంలో తెగిపోయిన యువకుడి చేతిని అతికించారు అపోలో వైద్యులు. మైక్రోవాస్క్యులర్ రీప్లాంటేషన్ శస్త్రచికిత్స చేసి చేతిని అతికించి పూర్వస్థితికి తీసుకొచ్చారు. ఈ తరహా పెద్ద ప్రాక్సిమల్ లింబ్ రీఅటాచ్‌మెంట్ చేయడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి అని వైద్యులు తెలిపారు. బుధవారం అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ జీఎస్ బండారి సర్జరీ వివరాలు వివరించారు. మంచిర్యాలకు చెందిన ఏ. పవన్‌కుమార్(32) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా డీసీఎం డోర్ కుడిచేయి కంకణానికి తగలడంతో చేయి మోచేతి వరకు తెగిపోయింది. తెగిన చేతిని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి పవన్‌కుమార్‌ను తీసుకొని బంధువులు అపోలో ఆస్పత్రికి గతనెల 11వ తేదీన వచ్చారు. వైద్యులు 8 గంటల పాటు శస్త్రచికిత్స చేసి విరిగిన చేతిని విజయవంతంగా అతికించారని బండారి వివరించారు. ఈ సందర్భంగా పేషెంట్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. విరిగిపోయిన చేతిని అపోలో ఆస్పత్రి వైద్యులు అతికించడంతో సంతోషంగా ఉన్నాను. త్వరలో కోలుకుంటానన్న నమ్మకం కలిగిందన్నాడు. సమావేశంలో ఆస్పత్రి సీఈవో తేజస్వి రావు, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మరో కొత్త ఫుడ్ డెలివరీ యాప్

రెజిమెంటల్‌బజార్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రెస్టారెంట్ టు యజమానులకు, కస్టమర్‌లకు ప్రయోజనం చేకూరే విధంగా వాయు జీరో కమీషన్ ఫుడ్ డెలివరీ యాప్ అందుబాటులోకి తెచ్చినట్లు వాయు యాప్ వ్యవస్థాపకులు మందర్ లాండే, అనిరుధ కోట్‌గిరే తెలిపారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సప్తగిరి హోటల్‌లో వాయు ఫుడ్ డెలివరీ యాప్‌ను ప్రారంభించారు. కస్టమర్‌లకు తక్కువ ఖర్చుతో ఆహారాన్ని ఇంటి వద్దకే పంపించడానికి యాప్‌ను హైదారాబాద్‌కు విస్తరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హైదారాబాద్ హోటల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కాపర్ వైర్ చోరీ

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖకు చెందిన కాపర్ వైర్ చోరీకి గురైంది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 45లోని జీహెచ్‌ఎంసీ పార్కు వద్ద ట్రాన్స్‌కో అధికారులు టవర్‌పై కేబుల్ పని నిర్వహిస్తున్నారు. ఇందు కోసం భారీగా కాపర్ వైర్లను ఉపయోగిస్తున్నారు. కాగా, ఈ నెల 5న టవర్ వద్ద ఉన్న 400 మీటర్ల కాపర్ వైర్ కనిపించకుండా పోయింది. దీంతో ఎర్రగడ్డ ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ ఎల్.ప్రసన్నధీరజ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌స్టాలో వల.. ఆపై వేధింపులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో యువతులతో పరిచయం పెంచుకొని వారి ఫొటోలను అసభ్యకరంగా మార్చి వేధింపులకు గురిచేస్తున్న బీటెక్ విద్యార్థిని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరుకు చెందిన ఎం.రామకృష్ణ బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అతడు ఇన్‌స్టాగ్రామ్‌లో అమ్మాయిలతో చాటింగ్ చేస్తూ వారి ఫొటోలు, వీడియోలు సేకరించి మార్ఫింగ్ చేస్తున్నాడు. వాటిని యువతకుల తాను చెప్పినట్లు వినాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. నగరానికి చెందిన ఓ యువతిని ఇలాగే వేధించడంతో ఆమె సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు గుంటూరు వెళ్లి రామకృష్ణను అరెస్ట్ చేసి అతడి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆన్‌లైనా.. ఆఫ్‌లైనా!



జేఎన్‌టీయూ పరిపాలనా భవనం

● జేఎన్‌టీయూలో పార్ట్‌టైమ్ కోర్సుల నిర్వహణపై వీడని సందిగ్ధత
● ఉన్నతాధికారుల నిర్ణయంలో జాప్యంతో అడ్మిషన్లపై ప్రభావం
● అభ్యర్థులు లేక సాయంకాలం బీటెక్, పార్ట్‌టైమ్ పీజీ కోర్సులకు గ్రహణం

హైదరాబాద్ సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచమంతా ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ వైపు పరుగులు పెడుతోంటే.. ఇంజనీరింగ్ కోర్సుల నిర్వహణలో జేఎన్‌టీయూ తీరు నత్త నయమన్నట్లుగా తయారైంది. ప్రతిష్ఠాత్మకమైన జేఎన్‌టీయూకు కొన్ని నెలలుగా రెగ్యులర్ వైస్‌చాన్స్‌లర్ లేకపోవడం, ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి నెలల తరబడి వర్సిటీకి రాకపోవడంతో అకడమిక్ అంశాలపై పూర్తిగా పర్యవేక్షణ కొరవడింది.

యూనివర్సిటీ ఆదాయానికి గండి

విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా.. కొన్ని ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం నోటిఫికేషన్ల జారీ, ఆయా కోర్సులను నిర్వహించే విధానాలు, పద్ధతులపై స్పష్టత ఉండడం లేదు. ఆవు చేలో మేస్తే.. సామెత చందంగా వైస్‌చాన్స్‌లర్ స్థాయి అధికారికే యూనివర్సిటీ వ్యవహారాల పట్ల బాధ్యత లేనప్పుడు తమకు మాత్రం పోయేదేముంది అన్నట్లుగా కిందిస్థాయి అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఇంజనీరింగ్ యూజీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లపైన తీవ్ర ప్రభావం పడుతోందని, ఫీజులు రూపేణా యూనివర్సిటీకి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

4 నెలలు ఆలస్యంగా నోటిఫికేషన్

డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం సాయంకాలం బీటెక్, గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఉద్యోగుల కోసం పార్ట్‌టైమ్ పీజీ కోర్సులను జేఎన్‌టీయూ ఆఫర్ చేస్తోంది.

అయితే, జూన్, జూలై నెలల్లో జారీ చేయాల్సిన సాయంకాలం బీటెక్ నోటిఫికేషన్‌ను 4 నెలలు ఆలస్యంగా అడ్మిషన్ల విభాగం అధికారులు ఇటీవల విడుదల చేశారు. జేఎన్‌టీయూతో పాటు అనుబంధంగా ఉన్న మరో 9కళాశాలల్లో మొత్తంగా 600లకు పైగా సీట్ల భర్తీకి రెండ్రోజుల క్రితం కౌన్సెలింగ్ చేపట్టారు. అయితే, ఒక్క కోర్సును కూడా ప్రారంభించేందుకు సరిపడా అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొంది. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల కిందట 150 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా, సుమారు 800 అభ్యర్థులు పోటీ పడ్డారని, జేఎన్‌టీయూ అధికారులు సకాలంలో నోటిఫికేషన్ ఇవ్వకపోవడం, కొత్తగా ప్రారంభిస్తున్న కోర్సులపై విస్తృతమైన ప్రచారాన్ని కల్పించకపోవడం వంటి కారణాలతో మొత్తం 9 కాలేజీల్లో ఒక్క కోర్సును కూడా ప్రారంభించలేని దుస్థితి ఏర్పడిందని వర్సిటీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ విధానంపై తేలని నిర్ణయం

మరోవైపు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల కోసమని జేఎన్‌టీయూ పార్ట్‌టైమ్ పీజీ(ఎంటెక్) కోర్సులను కూడా నిర్వహిస్తోంది. ఈ మేరకు వర్సిటీ అడ్మిషన్ల విభాగం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, ఎంటెక్ తరగతులకు సాయంత్రం/రాత్రి వేళల్లో హాజరు కావాల్సి ఉంది. ఓ వైపు విధుల నిర్వహణ, మరోవైపు దూర ప్రాంతాల నుంచి వారంలో ఆరు రోజులపాటు తరగతులకు హాజరు కావడం కష్టతరంగా మారిందని, పార్ట్‌టైమ్ కోర్సుల నిర్వహణలో ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేయాలని కొందరు అభ్యర్థులు యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌కు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల వినతి మేరకు ఆన్‌లైన్ విధానం అమలుకు అనుమతి కోసమని ప్రిన్సిపాల్, యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు అక్టోబరు 5న లేఖరాశారు. అయితే, నెలరోజులు దాటినా ఉన్నతాధికారుల నుంచి స్పందన కరువవడంతో కళాశాల అధికారులకు ఏంచేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. పూర్తిగా ఆఫ్‌లైన్ తరగతులంటే అభ్యర్థులు చేరేందుకు విముఖంగా ఉండడం, ఆన్‌లైన్ తరగతులకు వర్సిటీ ఉన్నతాధికారులు పర్మిషన్ ఇవ్వకపోవడంతో కోర్సుల నిర్వహణపై యూనివర్సిటీ వర్గాల్లో సందిగ్ధత నెలకొంది. పొరుగున ఉన్న ఏపీలోని ఆంధ్రా యూనివర్సిటీతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని పలు డీమ్డ్ యూనివర్సిటీలు, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఆన్‌లైన్ పీజీ కోర్సులను ఆఫర్ చేస్తుండగా, జేఎన్‌టీయూ మాత్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేని పరిస్థితుల్లో ఉండడంపై విద్యార్థి సంఘాలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. యూనివర్సిటీ పాలన గాడిలో పడాలంటే ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్‌ను నియమించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.31, వంకాయ రూ.50, బెండకాయ రూ.38, పచ్చి మిర్చి రూ.35, బజ్జి మిర్చి రూ.80, కాకర కాయ రూ.38, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.33, బీన్స్ రూ.70, క్యారెట్ రూ.75, గోబి పువ్వు రూ.23, దొండకాయ రూ.28, చిక్కుడు కాయ రూ.90, గోరు చిక్కుడు రూ.45, బీట్‌రూట్ రూ.50, క్యాప్సికం రూ.80, ఆలుగడ్డ రూ.38, కీర రూ.17, దోసకాయ రూ.40, సొర కాయ రూ.25, పొట్లకాయ రూ.18, కంద రూ.65, ఉల్లిపొరక రూ.55, ఉల్లిగడ్డ రూ.40, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.40, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.40, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.8-10, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.380, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.50, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.65, లోబా రూ.40, ఆ కాకరకాయ రూ.100. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధికి శ్రీకారం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డుబోయినపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో అత్యంత మెజారిటీని కట్టబెట్టిన ఓల్డుబోయినపల్లి డివిజన్ ప్రజలను ఎన్నటికి మర్చిపోనని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఓల్డుబోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధికి కేసీఆర్, కేటీఆర్‌తో చర్చించి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క అభివృద్ధి పని కూడా ముందుకు సాగడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసిందని ఆరోపించారు. ప్రజలకు ఏకష్టం వచ్చిన వారి కోసం ముందుడి పోరాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, మన్నె ఉదయ్ యాదవ్, మక్కల నర్సింగ్‌రావు, సయ్యద్ ఎజాజ్, ఇర్ఫాన్, హరినాథ్, లలిత, గడ్డం నర్సింగ్‌రావు, అనురాధ, మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, మిరాజ్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప సన్నిధానంలో దేవతా పాకశాల ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్‌లోని సిద్ధి వినాయక భ్రమరాంబ మల్లికార్జున ఆలయ ప్రాంగణంలో బుధవారం అయ్యప్ప దేవతా పాకశాలను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. అయ్యప్ప స్వాములను దృష్టిలో పెట్టుకొని ఆలయ కమిటీ నిర్వాహకులు కట్టా శేఖర్‌రెడ్డి మంచి నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే అభినందించారు. ఆలయంలో భక్తులకు ఎటువంటి సౌకర్యాలు కావాలన్నా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. వెంకటేశ్వరరావు, రామయ్య, రాజేష్ రాయ్, సాయిబాబు చౌదరి, భవాని, శ్యాం సుందర్ పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లలు, తల్లి అదృశ్యం



ముగ్గురు పిల్లలు తల్లి లావణ్య

బాలానగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ముగ్గురు పిల్లలు, తల్లి అదృశ్యమయ్యారు. ఈ విషయం బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహబూబ్‌నగర్ నాగర్‌కర్నూల్ ముస్లీపల్లికి చెందిన నాగపురి రాజు భార్య ముగ్గురు పిల్లలతో కలిసి బతుకు దెరువు కోసం వచ్చి చింతల్ డివిజన్ పద్మానగర్ ఫేజ్-1లో నివాసముంటున్నారు. నాగపురి రాజు ఓ ప్రైవేట్ సంస్థలో వాచ్‌మన్. ఈ నెల 2న పిల్లల చదువు విషయంపై భార్యాభర్త గొడవ పడ్డారు. నవంబర్ 3న భర్త పనిమీద బయటకు వెళ్ళడంతో భార్య లావణ్య(26) ముగ్గురు పిల్లలను తీసుకొని ఇంటినుంచి వెళ్ళిపోయింది. విషయం తెలిసిన భర్త వారి ఆచూకీ కోసం వెతుకగా ఎక్కడ కనిపించకపోవడంతో బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై సామూహిక అత్యాచారం కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

యూసుఫ్‌గూడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళపై సామూహిక అత్యాచారం చేసిన ముగ్గురు నిందితులను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం సాయంత్రం ముగ్గురు వ్యక్తులు కొండాపూర్‌కు చెందిన మహిళను దుస్తులు ఉతకడానికి అని చెప్పి ఓంనగర్‌లోని తమ రూమ్‌కు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. పక్క ఇళ్లవారి సహాయంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితుల కోసం పోలీసులు మూడు టీమ్‌లుగా ఏర్పడి గాలింపు చర్యలు ప్రారంభించారు. బుధవారం తెల్లవారుజాము గచ్చిబౌలీలోని బయో డైవర్సిటీ వద్ద నిందితులు చందు, అజయ్, ఆరీఫ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం జరిగిన ఒక్క రోజు వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

పశ్చిమ బెంగాల్ నుంచి నగరానికి హెరాయిన్

● ఐటీ కారిడార్‌లో విక్రయం ● ముగ్గురి అరెస్టు.. 70గ్రాముల డ్రగ్ స్వాధీనం

గచ్చిబౌలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ బెంగాల్ నుంచి హైదరాబాద్‌కు హెరాయిన్ తీసుకొచ్చి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 70గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... వెస్ట్ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన అజ్మల్ హుస్సేన్(32), నూర్ ఆజంఖాన్(24)లు కూలీలు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఎస్‌కే సురోజ్(24) నానక్‌రాంగూడ లేబర్ కాలనీలో ఉంటూ కూలీపని చేస్తుంటాడు. అజ్మల్ హుస్సేన్, ఆజంఖాన్‌లు తమ స్వగ్రామంలో ఓ వ్యక్తి నుంచి 70గ్రాముల హెరాయిన్‌ను గ్రాము రూ. వెయ్యి చొప్పున కొనుగోలు చేశారు. దానిని నానక్‌రాంగూడలో ఉంటున్న సురోజ్‌కు గ్రాము రూ. 5వేల చొప్పున విక్రయించేందుకు ఈనెల 4న వెస్ట్ బెంగాల్ నుంచి నగరానికి వచ్చారు. సురోజ్ ఈ హెరాయిన్‌ను నానక్‌రాంగూడతో పాటు ఐటీ కారిడార్‌లోని ఐటీ ఉద్యోగులకు, ఇతరులకు ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకోవాలని పథకం వేశాడు. కాగా, ఈ సమాచారం అందుకున్న రంగారెడ్డిజిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం సాయంత్రం నానక్‌రాంగూడ లేబర్ కాలనీలోని ఇంటిపై దాడి చేశారు. అజ్మలు హుస్సేన్, ఆజంఖాన్, సురోజ్‌లను అదుపులోకి తీసుకున్నారు. రూ.3.5లక్షల విలువైన 70గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకొని ముగ్గురినీ అరెస్ట్ చేశారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో సమగ్ర కుటుంబ సర్వే



కేపీహెచ్‌బీలో చేపట్టిన సమగ్ర సర్వేలో డీసీ వంశీకృష్ణ

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో సమగ్ర కుటుంబ సర్వే బుధవారం ప్రారంభమైంది. కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల డీసీలు హరి కృష్ణయ్య, వంశీకృష్ణ ఆధ్వర్యంలో అన్నీ డివిజన్ వార్డు కార్యాలయాల్లో స్టిక్కర్లు, మెటీరియల్ పంపిణీ చేశారు. తొలిరోజు అన్నీ ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకు సామగ్రి కోసం ఎదురుచూపులు తప్పలేదు. మూసాపేట్ సర్కిల్‌లో 990, కూకట్‌పల్లి సర్కిల్‌లో 1030బ్లాకులుగా విభజించి ప్రతి డివిజన్‌కు ఒక ఇన్‌చార్జిని నియమించారు. 10మంది ఎమిరేటర్స్‌కు ఒక సూపర్ వైజర్‌ను నియమించి క్షేత్రస్థాయిలో సమగ్ర కుటుంబ సర్వే చేసే పనికి శ్రీకారం చుట్టారు. కేపీహెచ్‌బీలో డీసీ వంశీకృష్ణ, కూకట్‌పల్లిలో యూసీడీ పీవో ఇంద్రసేన పాల్గొన్నారు.

డీసీకి ఎమ్మెల్యే శుభాకాంక్షలు

హైదర్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మూసాపేట్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వంశీకృష్ణకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.



● మూసాపేట్ సర్కిల్ ఉపకమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వంశీకృష్ణకు శుభాకాంక్షలు చెబుతున్న కూకట్‌పల్లి సీపీఐ కార్యదర్శి జి.కృష్ణ

-హైదర్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి)



వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణ వీధిలో ఉన్న పెద్దమ్మతల్లి దేవాలయం వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు బుధవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- హైదర్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి)



తిరుమలలో టీటీడీ బోర్డు మెంబర్‌గా నన్నూరి నర్సిరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బుధవారం మూసాపేట్ టీడీపీ సీనియర్ నాయకులు ఉప్పు రామకృష్ణ, హరికృష్ణ, బాలు, ఆర్.వెంకటేష్‌గౌడ్, విజయ్, సప్పిడి, వెంకటేష్ హాజరయ్యారు.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి)

నేడు పార్కు ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్‌లోని హెచ్‌ఐజీ నివాసాల మధ్య 2022లో పనులకు శ్రీకారం చుట్టి రూ.2కోట్లతో అభివృద్ధి చేసిన ఫ్రీడం ఆయిల్ పార్కును గురువారం ప్రారంభించనున్నారు. జెమిని ఎడిబిల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద ఈ పార్కును అభివృద్ధి చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష బాబురావు పార్కు పనులను పరిశీలిస్తూ వచ్చారు. జీఈఎఫ్ ఇండియా ఎండీ ప్రదీప్ చౌదరి, సీనియర్ ఉపాధ్యక్షులు పి.చంద్రశేఖర్‌రెడ్డి గురువారం లాంఛనంగా ప్రారంభించి, పార్కును స్థానికులకు అందుబాటులోకి తేనున్నారు.

చెక్‌మేట్ కన్సల్టెన్సీ వ్యవహారంలో ఇద్దరి అరెస్ట్

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలో సీట్లు ఇప్పిస్తానని మోసం చేసిన చెక్‌మేట్ కన్సల్టెన్సీ వ్యవహారంలో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీనగర్‌కాలనీకి చెందిన కన్సల్టెన్సీ నిర్వాహకుడు రోహిత్ ఓ వ్యక్తి వద్ద ఇంజనీరింగ్ సీటుకోసం రూ.8 లక్షలు తీసుకున్నాడు. మరొకరి వద్ద మెడికల్ సీటు కోసం రూ.3 లక్షలు, ఓ మహిళ వద్ద ఉద్యోగం కోసం రూ.8 లక్షలు తీసుకున్నాడు. మరో మహిళ వద్ద కార్యాలయం ఆధనీకరణ పేరుతో రూ.70 లక్షలు తీసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు రోహిత్‌తో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఎ-2గా ఉన్న భవానీశంకర్, ఎ-6గా ఉన్న అచ్యూత్‌సాయిరాంచౌదరిలను అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. రోహిత్ కోసం గాలిస్తున్నారు.

హోంగార్డును బైక్‌తో ఢీకొట్టిన యువకుడిపై కేసు

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనం నడిపి హోంగార్డును ఢీకొట్టిన యువకుడిపై కేసు నమోదైంది. చింతల్‌కు చెందిన జి.శ్రీనివాస్ బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 5న సాగర్‌సొసైటీ చౌరస్తాలో విధుల్లో ఉండగా ద్విచక్రవాహంపై వచ్చిన మల్కాజిగిరికి చెందిన దివ్యాంష్ భట్టి ఆయన్ను ఢీకొట్టాడు. దీంతో శ్రీనివాస్ కాలు విరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళా కానిస్టేబుల్‌పై దాడి

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ విషయంలో మహిళా కానిస్టేబుల్, ఆమె సోదరుడితో ఘర్షణకు దిగిన కొందరు వారిద్దరిపై దాడిచేశారు. బంజారాహిల్స్ సయ్యద్‌నగర్‌కు చెందిన జహరారా ఫర్హీన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుంది. ఈ నెల 2న ఆమె సోదరుడు మహ్మద్ అశ్ఫక్ అలీ ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి అతడు వాహనం పెట్టేచోట ఓ సైకిల్ పార్క్ చేసి ఉంది. ఈ క్రమంలో అక్కడే ఉన్న కొంతమంది అతడిని దుర్భాషలాడుతూ దాడి చేశారు. సమాచారం అందుకున్న ఫర్హీన్ అక్కడకు వెళ్లడంతో ఆమెపై కూడా దాడిచేశారు. గాయాలతో ఆస్పత్రిలో చేరిన ఆమె ఈ నెల 5న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సెక్యూరిటీ గార్డుపై బండరాయితో దాడి

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ సెక్యూరిటీ గార్డుపై బండరాయితో దాడిచేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మెహిదీపట్నంకు చెందిన వెంకటరత్నం సబ్జాకాలనీ సత్వా మాగ్నస్ అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు.

ఈనెల 4న రాత్రి అదే అపార్ట్‌మెంట్‌లో నివసించే వైభవ్ బిల్డింగ్ ప్రధాన గేటు వద్ద ఉన్న ట్రాఫిక్ కోన్స్ చూసి సెక్యూరిటీ గార్డును దుర్భాషలాడాడు. అతడిని అడ్డుకునే ప్రయత్నం చేసిన వెంకటరత్నంపై బండరాళ్లు విసిరాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. గతవారం సైతం వైభవ్ సెక్యూరిటీ గార్డుపై దాడి చేశాడు. వెంకటరత్నం ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకే టికెట్లు కేటాయించాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, రాజేందర్, రామకృష్ణ, అనంతయ్య తదితరులు

బర్కత్‌పుర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న రెండు పట్టభద్రులు, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీ అభ్యర్థులకే టికెట్లు కేటాయించాలని మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఏ పార్టీ అయితే బీసీలకు ఎమ్మెల్సీ టికెట్లు ఇవ్వదో ఆ పార్టీని ఎన్నికల్లో ఓడిస్తామని ఆయన హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు భూపేష్‌సాగర్ సంయుక్త ఆధ్వర్యంలో బీసీ సంఘాల కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ... కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, రెండు పట్టభద్రుల నియోజకవర్గాలు నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్నాయని, ఈ మూడు నియోజకవర్గాలలో బీసీ అభ్యర్థులనే పోటీలో నిలపాలని కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలకు ఆయన విజ్ఞప్తి చేశారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలను పూర్తిగా విస్మరించాయని, కనీసం ఎమ్మెల్సీ ఎన్నికల్లో అయినా బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు టి.రాజ్‌కుమార్, వేముల రామకృష్ణ, మల్లేష్‌యాదవ్, అనంతయ్య, మోదీ రాందేవ్, జోషి రాఘవ, భాస్కర్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

వెస్ట్‌జోన్‌లో తొలిరోజు సర్వే ఇలా..

● ఇళ్లకు స్టిక్కర్లు అంటించిన సిబ్బంది ● జెడ్సీ పర్యవేక్షణ ● పాల్గొన్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ, ఎమ్మెల్సీ ప్రభాకర్, కార్పొరేటర్లు


ఖాజాగూడలో ఎమ్మెల్సీ ప్రభాకర్ నివాసానికి స్టిక్కర్ అంటిస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి, సిబ్బంది


పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీకి స్టిక్కర్ అందజేస్తున్న అధికారులు


వివరాలను తెలుపుతున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

గచ్చిబౌలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ పరిధిలో బుధవారం పెద్దఎత్తున ఇంటింటి సర్వే ప్రారంభమైంది. నాలుగు సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పర్యవేక్షణలో సర్వే ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వేను జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఈ సర్వేలో సుమారు 15రోజుల పాటు పనిచేయనున్నారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించే దిశగా ఎన్యుమరేటర్లకు వారు సర్వే చేయాల్సిన ప్రాంతాలను సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు, కిందిస్థాయి సిబ్బంది వారి బ్లాక్‌లను చూపించడంతో పాటు స్టిక్కర్లు వేయాలని సూచించారు. వారికి కేటాయించిన ప్రాంతాల్లో బుధవారం స్టిక్కర్ల కార్యక్రమం ప్రారంభమైంది. సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు హాజరయ్యారు. వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ఈ ప్రక్రియ మూడు రోజుల పాటు జరగనుందని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. మొదటి రోజు సర్వేలో భాగంగా స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని జడ్సీ పర్యవేక్షించారు. నల్లగండ్ల, గచ్చిబౌలి, మాదాపూర్, ఖాజాగూడలో సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. సిబ్బందితో పాటు ఖాజాగూడలో ఎమ్మెల్సీ ప్రభాకర్ గృహానికి వెళ్లి స్టిక్కరును అంటించారు.

● మరో మూడు రోజులు ఇదే పని...

మొదటి రోజు ఎన్యుమరేటర్లకు వారు సర్వే నిర్వహించాల్సిన ప్రాంతాన్ని బిల్లుకలెక్టర్లు, ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు చూపించడంతో సర్వే సిబ్బందికి అవసరమైన పత్రాలు, స్టేషనరీని అధికారులు అందించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి దాదాపు 100కు పైగా అంశాలు సేకరించాల్సి ఉంటుంది. అందుకు గాను అధికారులు సుమారు నాలుగు లక్షలకు పైగా ఫారాలను సిద్ధం చేశారు. అందులో 50వేల దరఖాస్తులు ఇంగ్లి‌ష్‌లో ముద్రించి సిద్ధం చేశారు. వీటిని ఇప్పటికే సిబ్బందికి అందజేశారు.

● అందరూ సహకరించాలి

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో భాగంగా వెస్ట్‌జోన్ పరిధిలోని నాలుగె సర్కిళ్లలో ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వస్తారు. వారికి ఆయా ఇళ్ల యజమానులు, ప్రజలు సహకరించాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సర్వేకు సంబంధించిన వివరాలు ఒకచోట నమోదు చేస్తే మరోచోట వివరాలు ఇవ్వాల్సిన పనిలేదని తెలిపారు. ముఖ్యంగా గేటెడ్ కమ్యూనిటీలు, అపార్టుమెంట్‌లు, బహుళ అంతస్తుల భవనాలు, కాలనీలు, ప్రజలు ప్రతి ఒక్కరూ ఈ సర్వేకు సహకరించాలని జడ్సీ కోరారు.

కచ్చితమైన వివరాలతో సర్వే నిర్వహించాలి

హైదర్‌నగర్: వివేకానందనగర్ సప్తగిరికాలనీలోని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఇంటికి ఉపకమిషనర్ కృష్ణయ్య, అధికారులు స్టిక్కర్ అంటించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సమగ్ర కులగణన చేపడుతోందని అన్నారు. ఎన్నోఏళ్ల కల నేటితో నేరవేరనుందని, సమగ్ర కులగణన చేపట్టడం హర్షించదగ్గ విషయమని సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు కచ్చిత్వంతో కూడిన సర్వేను నిర్వహించాలని, ఎక్కడ ఏ పొరపాటు కూడా జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా కులగణన కోసం వచ్చిన అధికారులకు పూర్తిగా సహకరించాలని, నిజాలు మాత్రమే చెప్పాలని పిలుపు నిచ్చారు.


హైదర్‌నగర్‌లో సర్వేలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు


వివేకానందనగర్‌లో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న కార్పొరేటర్ రోజాదేవి

క్షుణ్ణంగా వివరాలు సేకరించాలి : ఎమ్మెల్యే

చందానగర్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను స్బిబంది క్షేత్రస్థాయిలో చేపట్టి, కచ్చితమైన వివరాలను నమోదు చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సూచించారు. సర్వేను చందానగర్ సర్కిల్ పరిధిలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్, డీసీ మోహన్ రెడ్డితో కలిసి ప్రారంభించి, నమోదు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఇంటింటి సర్వే కార్యక్రమానికి కేటాయించిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు వివరాలను పూర్తి స్థాయిలో సేకరించాలని, తప్పులు దొర్లకుండా క్షుణ్ణంగా వివరాలను తెలుసుకుని నమోదు చేసుకోయాలని సూచించారు. ఈ నెల 19వ తేదీ వరకు సర్వే పూర్తిచేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ పి.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సిబ్బందికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని, మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట, చందానగర్ డివిజన్‌లలో ప్రతి ఇంటికీ వెళ్లి సమాచారం సేకరించి సిక్కర్లను పెట్టలన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, ప్రసాద్, అక్బర్‌ఖాన్, ఎలమ్మయ్య, బాలకృష్ణ చౌదరి, సందీప్‌రెడ్డి ప్రాజెక్టు అధికారిని ఉషారాణి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేతో పేదలకు మేలు : కార్పొరేటర్

ఖేల్‌కాలనీ: సమగ్రకులగణన నమోదు కార్యక్రమాన్ని భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి నివాసం నుంచి అధికారులు ప్రారంభించారు. సమగ్ర కులగణన ద్వారా బడుగు, బలహీన వర్గాలు, వెనకబడిన తరగతుల కులాల వివరాలు తెలుస్తాయని అన్నారు.

వివేకానందనగర్‌లో...

హైదర్‌నగర్: సమగ్ర కుటుంబ సర్వేను బుధవారం వివేకానందనగర్ డివిజన్ వార్డు ఆఫీస్ నుంచి ప్రారంభించారు. ఈ సర్వేలో కార్పొరేటర్ రోజాదేవి పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలు సహకరించాలని సూచించారు. అధికారులు నిజాయితీగా సర్వేచేయాలని కోరారు.

హైదర్‌నగర్ డివిజన్‌లో

● హైదర్‌నగర్ డివిజన్‌లో నిర్వహించిన సర్వేలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు రాజీవ్, మహదేవ్, సుబ్బలక్ష్మి, రేణుక, ఏలేంద్ర, శ్రీదేవి, ప్రశాంతి, స్వాతి, నాయకులు నిరంజన్‌గౌడ్, నిఖిల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే'

దేశానికే గర్వకారణం

జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి



ఇంటర్వ్యూ

గచ్చిబౌలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియతో బీసీలకు, అట్టడుగు వర్గాలకు స్వాతంత్ర్య ఫలాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ సర్వేను చిత్తశుద్ధితో అమలు చేస్తే.. ఇదే ఒరవడి దేశవ్యాప్తంగా జరిగే ఆస్కారం ఉంది. తొలి అడుగు తెలంగాణ ప్రభుత్వం నుంచి పడటం తెలంగాణ ప్రజలు, ప్రభుత్వానికి గర్వకారణం. అందుకు సహకరిస్తున్న ప్రజలకు, అధికారులకు, నిబద్ధతతో వెనుకబడిన అభివృద్ధిని కోరుకుంటున్నట్లుగా తెలుస్తుంది. బుధవారం ప్రారంభమైన సర్వే సందర్భంగా జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలను తెలిపారు.

సమగ్ర ఇంటింటి సర్వే ఏ మేరకు అవసరం ఉంటుంది? ఫలితాలు ఎలా ఉంటాయి?

క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని ప్రతిరోజూ కంప్యూటర్‌లో ఎంటర్ చేస్తాం. పగడ్బందీగా డేటాను సేకరించి కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసి ప్రభుత్వానికి పంపిస్తాం. ప్రభుత్వం అప్పగించిన పని వందశాతం విజయవంతం చేసేందుకు కృషిచేస్తున్నాం.

గత ప్రభుత్వం కూడా ఇంటింటి సర్వే ఒక్క రోజు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం 15 రోజులు చేయడం ఏమిటి?

అప్పుడు సర్వేచేసిన వివరాలు అప్పటి ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. ఇప్పుడు చేసే సర్వేలో కులగణన, కుటుంబ వివరాలను సేకరించడం జరుగుతుంది. ముఖ్యంగా కులగణన, రిజర్వేషన్ ప్రక్రియ కోసం ప్రభుత్వం నిర్వహిస్తుందని భావిస్తున్నాం.

సర్వే పూర్తయితే తప్ప స్థానిక సంస్థల ఎన్నికలు జరగవా?

సర్వే తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ ఆదేశాలను తాము అమలు చేస్తున్నాం.

సర్వేలో శిక్షణ ఇచ్చిన అందరూ పాల్గొంటున్నారా?

వెస్ట్‌జోన్ పరిధిలో ఇంటింటి సర్వేలో అధికారులు, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు మొత్తం కలిసి 3,500 మంది పాల్గొంటున్నారు. విధులకు అందరూ సమయానికి వస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైన రాకపోతే అదనంగా ఉన్న సిబ్బందిని వినియోగిస్తాం.

'గీతం' విద్యార్థికి రూ.60 లక్షల వేతనం

రూ.51 లక్షల వార్షిక వేతనంతో మైక్రోసాఫ్ట్‌కు ఎంపికైన మరో ఇద్దరు విద్యార్థులు


అనూష


సమీన

పటాన్‌చెరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మరోసారి ప్రాంగణ నియామకాల్లో మేటిగా నిరూపించుకుంది. ప్రతిష్ఠాత్మక బహుళజాతి సంస్థల భాగస్వామ్యంతో విశేష విజయాలను ప్రదర్శిస్తూ, 2024-25 విద్యా సంవత్సరానికి ప్రాంగణ నియామకాల్లో మరోసారి తన సత్తా చాటింది. అత్యధిక గరిష్ఠ వార్షిక వేతనం రూ.60 లక్షలతో ఒక విద్యార్థిని ఎంపిక కాగా, మరో ఇద్దరు రూ.51 లక్షల గరిష్ఠ వార్షికవేతనానికి ఎంపికయ్యారు. బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థిని యర్రం అనూష అట్లాసియన్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా గౌరవనీయమైన స్థానాన్ని సంపాదించుకుని, రూ.60 లక్షల వార్షిక వేతనాన్ని పొందనుంది. అంతేగాక, తన తోటి విద్యార్థిని కొర్రపాటి సమీనాతో కలిసి మైక్రోసాఫ్ట్‌లో రూ.51లక్షల వార్షిక వేతనంతో సాఫ్ట్ వేర్ డెవలపర్‌గా ఎంపికైంది.

సిలికాన్‌ల్యాబ్ గీతం విద్యార్థి ఒకరిని రూ.22 లక్షల వార్షిక వేతనానికి ఎంపిక చేయగా, పెగా సిస్టమ్స్ ఏడుగురు విద్యార్థులకు రూ.15.48 లక్షలు, డెలివరూ ముగ్గురికి రూ.12.07 లక్షలు, ఒరాకిల్ ఐదుగురికి రూ.10 లక్షలు, రిలయన్స్ జియో టీపీ ఒక విద్యార్థికి రూ.9 లక్షలు, డెలాయిట్ పీపీవో ఐదుగురికి రూ.8.64 లక్షలు, ఏషియన్ పెయింట్స్ ముగ్గురికి రూ.8.5 లక్షలు, ఐసీఐసీఐ బ్యాంక్ 14 మందికి రూ.8.29 లక్షలు, నౌకరీ.కామ్ ఒక్కరికి రూ.7 లక్షలు, పీజీఎస్ ముగ్గురు విద్యార్థులకు రూ.8 లక్షలు, కీలూప్ ఆరుగురికి రూ.7.2 లక్షలు, వయాప్లస్ ఐదుగురికి రూ.7 లక్షలు, హెచ్ అండ్ ఆర్ బ్లాక్ నలుగురికి రూ.5.27 లక్షలు, మ్యూసిగ్మా 17మందికి రూ.5 లక్షలు, ఈవైజీడీఎస్ 49 మందికి రూ.4.83 లక్షలు, యాక్సెంచర్ 92 మందికి రూ.4.5 లక్షలు, టెక్ మహీంద్రా 85 మంది విద్యార్థులను రూ.4 లక్షల వార్షిక వేతనానికి ఎంపిక చేశాయి. కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ మమతారెడ్డి ప్రస్తుత ప్లేస్ మెంట్ సీజన్‌పై మాట్లాడుతూ.. 'ఈ ఏడాది మా ప్రాంగణ నియామకాలను అట్లాసియన్, మైక్రోసాఫ్ట్, సిలికాన్ ల్యాబ్స్, పెగా సిస్టమ్స్ వంటి ప్రముఖ బహుళ జాతి కంపెనీలతో ప్రారంభించడం ఆనందంగా ఉంది' అని అన్నారు.

తెగిపోయిన చేతిని అతికించిన అపోలో వైద్యులు

● ఈ తరహా శస్త్రచికిత్స తెలుగు రాష్ట్రాల్లో మొదటిది


పేషెంట్ పవన్‌కుమార్‌తో వైద్యులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రమాదంలో తెగిపోయిన యువకుడి చేతిని అతికించారు అపోలో వైద్యులు. మైక్రోవాస్కులర్ రీప్లాంటేషన్ శస్త్రచికిత్స చేసి చేతిని అతికించి పూర్వస్థితికి తీసుకొచ్చారు. ఈ తరహా పెద్ద ప్రాక్సిమల్ లింబ్ రీఅటాచ్‌మెంట్ చేయడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి అని వైద్యులు తెలిపారు. బుధవారం అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ జీఎస్ బండారి సర్జరీ వివరాలు వివరించారు. మంచిర్యాలకు చెందిన ఏ. పవన్‌కుమార్(32) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా డీసీఎం డోర్ కుడిచేయి కంకణానికి తగలడంతో చేయి మోచేతి వరకు తెగిపోయింది. తెగిన చేతిని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి పవన్‌కుమార్‌ను తీసుకొని బంధువులు అపోలో ఆస్పత్రికి గతనెల 11వ తేదీన వచ్చారు. వైద్యులు 8 గంటల పాటు శస్త్రచికిత్స చేసి విరిగిన చేతిని విజయవంతంగా అతికించారని బండారి వివరించారు. ఈ సందర్భంగా పేషెంట్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. విరిగిపోయిన చేతిని అపోలో ఆస్పత్రి వైద్యులు అతికించడంతో సంతోషంగా ఉన్నాను. త్వరలో కోలుకుంటానన్న నమ్మకం కలిగిందన్నాడు. సమావేశంలో ఆస్పత్రి సీఈవో తేజస్విరావు, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్ నుంచి నగరానికి హెరాయిన్

ఐటీ కారిడార్‌లో విక్రయం

● ముగ్గురి అరెస్టు

గచ్చిబౌలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ బెంగాల్ నుంచి హైదరాబాద్‌కు హెరాయిన్ తీసుకొచ్చి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 70 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... వెస్ట్ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన అజ్మల్‌హుస్సేన్(32), నూర్ ఆజంఖాన్(24)లు కూలీలు. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన ఎస్‌కే సురోజ్(24) నానక్‌రాంగూడ లేబర్‌కాలనీలో ఉంటూ కూలీ పని చేస్తుంటాడు. అజ్మల్ హుస్సేన్, ఆజంఖాన్‌లు స్వగ్రామంలో ఓ వ్యక్తి నుంచి 70 గ్రాముల హెరాయిన్‌ను గ్రాము రూ.వెయ్యి చొప్పున కొనుగోలు చేశారు. దానిని నానక్‌రాంగూడలో ఉంటున్న సురోజ్‌కు గ్రాము రూ.5 వేల చొప్పున విక్రయించేందుకు ఈ నెల 4న వెస్ట్ బెంగాల్ నుంచి నగరానికి వచ్చారు. సురోజ్ ఈ హెరాయిన్‌ను నానక్‌రాంగూడతో పాటు ఐటీ కారిడార్‌లోని ఐటీ ఉద్యోగులకు, ఇతరులకు ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకో వాలని పథకం వేశాడు. కాగా, ఈ సమాచారం అందుకున్న రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం సాయంత్రం నానక్‌రాంగూడ లేబర్ కాలనీలోని ఇంటిపై దాడి చేశారు. అజ్మలు హుస్సేన్, ఆజంఖాన్, సురోజ్‌లను అదుపులోకి తీసుకున్నారు. రూ.3.5 లక్షల విలువైన 70గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకొని ముగ్గురినీ అరెస్ట్ చేశారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల సూపర్ హ్యాట్రిక్

20 రాష్ట్రాల నుంచి పదివేల మంది విద్యార్థులతో వరల్డ్‌రికార్డు


సూపర్ హ్యాట్రిక్ వరల్డ్‌రికార్డు సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ, యూకేలోని వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు

మియాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం చరిత్రలో శ్రీచైతన్య విద్యాసంస్థలు మరో మైలురాయిని చేరుకున్నాయని తద్వారా సూపర్ హ్యాట్రిక్ వరల్డ్‌రికార్డు సాధించడం జరిగిందని శ్రీచైతన్యస్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ అన్నారు. నవంబరు 6న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ కార్యక్రమంలో 20 రాష్ట్రాల నుంచి పదివేలమంది శ్రీచైతన్య సంస్థల విద్యార్థులు పాల్గొని మూడు గంటల్లో మాథ్స్ ఫార్ములాలను పఠించి ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులు 3 నుంచి 10సంవత్సరాల లోపు విద్యార్థులు కావడం విశేషం. ఈ కార్యక్రమానికి యూకేలోని వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు ప్రత్యక్షంగా ఉండి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థకు సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డును అందజేయడంతోపాటు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. మియాపూర్‌లోని స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీమ మాట్లాడుతూ 2018లో రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల వయస్సు కలిగిన 100 మంది విద్యార్థులు వంద దేశాల మ్యాప్‌లను పఠించి భౌగోళిక అవగాహనలో అద్భుత విజయం సాధించారన్నారు. 2022లో 601 విద్యార్థులు 118అంశాలను పఠించి 10 రాష్ట్రాల్లో పరమాణు చిహ్నాలతో కూడిన ఆవర్తన పట్టికలను ప్రదర్శించారు. 2023లో 2033మంది విద్యార్థులు వంద నిమిషాల్లో 1 నుంచి వంద వరకు గుణకార పట్టికలు పఠించిన నాటి ప్రపంచ రికార్డులను ఆమె గుర్తు చేశారు. ఇది కేవలం వందరోజుల్లో మా అధ్యాపకులు ఇచ్చిన శిక్షణకు నిదర్శనమన్నారు. ఈ ఏడాది సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డు చైతన్య విద్యార్థులు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శివసేనా

స్పోర్ట్స్ పాలసీతో విప్లవాత్మక మార్పులు

● శాట్ చైర్మన్ శివాసేనారెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): నూతన స్పోర్ట్స్ పాలసీతో రాష్ట్ర క్రీడారంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) చైర్మన్ శివాసేనా రెడ్డి అన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని శాట్ క్రీడా సముదాయంలో నిర్వహించిన క్రీడాపాలసీపై సమీక్షలో ప్రభుత్వ క్రీడాశాఖ కార్యదర్శి జయేష్‌రంజన్, టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర స్క్వాష్ సంఘం ఉపాధ్యక్షుడు మహేష్‌గౌడ్, శాప్ మాజీ చైర్మన్, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, 37 రాష్ట్ర క్రీడా సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా శివాసేనారెడ్డి మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద క్రీడాకారులను దృష్టిలో పెట్టుకుని కొత్తస్పోర్ట్స్ పాలసీని రూపొందిస్తున్నామని చెప్పారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలి

ఖేల్‌కాలనీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహిస్తే వారు మంచి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని బీహెచ్ఈఎల్ ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సురేందర్ అన్నారు. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో గెలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన వారిని అసోసియేషన్ సభ్యులు అభినందించి బహుమతులను అందచేశారు. వాలీబాల్ అండర్17లో నవ్యశ్రీ, హాకీ అండర్14లో శైలేంద్రనాథ్, బాలసాయి సందీప్, అండర్17లో యోగేందర్‌లో రాష్ట్రస్థాయి పోటీలను ఎంపికవ్వగా వారికి జ్ఞాపికలను అందజేశారు. అధ్యక్షుడు సురేందర్ మాట్లాడుతూ ఐటీ సంస్థలు, పరిశ్రమలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సహకారం అందించి వారిని ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమమంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి దేవార్జున్, ఉపాధ్యక్షుడు కోడాలి సూరేష్, కోశాధికారి నర్సింలు ప్రిన్సిపాల్ రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్నఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణ వీధిలో ఉన్న పెద్దమ్మ తల్లిదేవాలయం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న సుషిలా బొకాడియా

పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1 లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో డిసన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శనను సామాజికవేత్త సుషిలా బొకాడియా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విభిన్నమైన హ్యాండ్లూమ్ చీరలతో పాటు పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్ర ఉత్పత్తులను ఒకే వేదికపై ప్రదర్శించడం అభినందనీయమన్నారు. డిసన్స్ పటోలా ఆర్ట్స్ ఎక్స్‌పో నిర్వాహకుడు భవిన్‌మక్వానా మాట్లాడుతూ.. నేతకార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ నెల 11 వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ 'ఎస్టీఎఫ్' తనిఖీలు

● 4.36 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురు స్మగ్లర్ల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ ఎస్టీఎఫ్(స్టేట్ టాస్క్‌ఫోర్స్) బృందం పోలీసులు బుధవారం తనిఖీ చేశారు. ఒడిశా నుంచి నగరానికి వచ్చి గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు స్మగ్లర్స్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 4.36 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

శేరిలింగంపల్లిలో..

మియాపూర్ ప్రాంతంలో గంజాయి నిల్వ చేశారనే సమాచారం మేరకు ఎస్టీఎఫ్ టీమ్ సీఐ సుబాష్‌చందార్‌రావు సిబ్బందితో తనిఖీ చేశారు. అసోం ప్రాంతం నుంచి వచ్చి సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్న భరత్ భూయ్యా అనే వ్యక్తి ఇంట్లో 1.23 కేజీల గంజాయి లభించింది. అతడు పనిచేస్తున్న ప్రాంతాల్లో పెంచుతున్న మూడు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని శేరిలింగంపల్లి ఎక్సైజ్‌పోలీసులకు అప్పగించారు.

సరూర్‌నగర్‌లో..

సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో ఎస్టీఎఫ్ టీమ్ ఎస్ఐ బాలరాజు బృందం బాలాపూర్ మండలం, మల్లాపూర్ గ్రామంలో తనిఖీ చేసింది. ఒడిశాకు చెందిన కూన సేప్ అనే వ్యక్తి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైల్లో గంజాయి తీసుకొచ్చి అమ్మకందార్లకు ఇచ్చి వెళ్తున్నట్లు గుర్తించి అతడిని పట్టుకున్నారు. 1.53 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

మల్కాజిగిరిలో..

మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నేరేడ్‌మెట్ ప్రాంతంలో ఎస్టీఎఫ్ సీఐ బాలరాజు బృందం ఓ ఇంట్లో తనిఖీ చేయగా 1.60 కిలోల గంజాయి లభించింది. ఓ స్కూటీని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఫహిమా బేగంను అరెస్ట్ చేశారు. షాన్‌వాజ్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. కేసును మల్కాజిగిరి స్టేషన్‌కు అప్పగించారు.

సెల్‌ఫోన్ వాడకం తగ్గించి పుస్తకంపై శ్రద్ధ పెట్టాలి


ప్రగతినగర్‌లోని ప్రభుత్వ పాఠశాల లైబ్రరీకి ఉచిత కథల పుస్తకాలు పంపిణీ

నిజాంపేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్‌లోని లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అభయాస్ ఎడ్యుటెక్ కూకట్‌పల్లి వారి సౌజన్యంతో బుధవారం ప్రగతినగర్‌లోని ప్రభుత్వ పాఠశాల లైబ్రరీకి కథల పుస్తకాలు, పిల్లల మేధస్సుకు ఉపయోగపడే రకరకాల పుస్తకాలను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా కరెంట్ అఫైర్స్‌పై ఎప్పుడూ అప్‌డేట్‌లో ఉండాలని తెలిపారు. అనంతరం ఎడ్యుటెక్ కూకట్‌పల్లి జనరల్ మేనేజర్ వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్ ఎక్కువ ఉపయోగించకుండా పుస్తకాలను చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నయ్య మాట్లాడుతూ దాతలు ఇచ్చిన ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకొని మేధో సంపత్తిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అభయాస్ ఎడ్యుటెక్ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్, అనీల్, జెవీవీ నాయకులు మల్లాచారి, శంకర్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

మరో కొత్త ఫుడ్ డెలివరీ యాప్

రెజిమెంటల్‌బజార్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెస్టారెంటు యజమానులకు, కస్టమర్‌లకు ప్రయోజనం చేకూరేవిధంగా వాయు జీరో కమీషన్ ఫుడ్ డెలివరీ యాప్ అందుబాటులోకి తెచ్చినట్లు వాయు యాప్ వ్యవస్థాపకులు మందర్ లాండే, అనిరుధ కోట్‌గిరే తెలిపారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సప్తగిరి హోటల్‌లో వాయు ఫుడ్ డెలివరీ యాప్‌ను ప్రారంభించారు. కస్టమర్‌లకు తక్కువ ఖర్చుతో ఆహారాన్ని ఇంటి వద్దకే పంపించడానికి యాప్‌ను హైదారాబాద్‌కు విస్తరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హైదారాబాద్ హోటల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

58 రోజులు

విద్యాశాఖ యాక్షన్ ప్లాన్

- పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభం
- వందశాతం ఉత్తీర్ణత లక్ష్యం

గాజులరామారం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. వచ్చే మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేసేందుకు విద్యాశాఖాధికారులు 58 రోజులు యాక్షన్ ప్లాన్ రూపొందించి ప్రతీరోజు సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 గంటల వరకు షెడ్యూలు ప్రకారం ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గండిమైసమ్మ, దుండిగల్, బాచుపల్లి మూడు మండలాల్లో 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా, అందులో బాలికలు 9,500మంది, బాలురు 7,714మంది ఉండగా, మొత్తం 17,214 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు.

వచ్చే మార్చిలో జరగబోయే పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు సిలబస్ పూర్తిచేసి, రివిజన్‌ను ప్రారంభించాలని విద్యాధికారులు ఉపాధ్యాయులకు సూచించారు. మొదటి రోజు సాంఘికశాస్త్రం, 2వ రోజు హిందీ, 3వ రోజు గణితం, 4వ రోజు ఇంగ్లీష్, 5వ రోజు ఫిజికల్ సైన్స్, 6వ రోజు సోషల్, 7వ రోజు బయాలజీ సబ్జెక్టులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రతీరోజు నిర్వహించిన తరగతులకు సంబంధించిన రికార్డులను ఉంచాలని, ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని, ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషిచేయాలని అధికారులు ఆదేశించారు.


స్పెషల్ క్లాసుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

పాఠాలను శ్రద్ధగా వింటున్నాం



ప్రత్యేక తరగతులు చాలా ఉపయోగపడుతున్నాయి. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను వింటూ, శ్రద్ధగా చదువుకుంటున్నాం. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేరుస్తూ, పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తాం.

- విజయ, పదో తరగతి

టాపర్‌గా నిలుస్తాం



ఉపాధ్యాయులు చెప్పే ప్రత్యేక పాఠాల వల్ల రాబోయే పదో తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలుస్తాం. స్పెషల్ క్లాసులతో పాటు నైపుణ్యాన్ని పెంచుకొని, పరీక్షల్లో మంచి ఫలితాన్ని సాధిస్తాం.

- శిరిషా, పదోతరగతి

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం

- అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు

దుండిగల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని సుచిత్రా అకాడమి ఇంటర్నేషనల్ స్కూల్లో అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు డ్రైవర్లు, హెల్పర్లు, సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులను బస్సుల్లో తీసుకువెళ్లేప్పుడు డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నూతన చట్టాల ప్రకారం అజాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తే జరిమా నతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందని తెలిపారు. తప్పని సరిగా డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, అలాగే అన్ని పత్రాలు సరిగి ఉంచుకోవాలని,డ్రెస్ కోడ్ తప్పకుండా పాటించాలని సూచించారు. స్కూల్ విద్యార్థులు బస్సు ఎక్కి, దిగే టప్పుడు మిర్రర్లు గమ నించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు

చదువురాని వారికీ సర్వే విధులు

- కుత్బుల్లాపూర్‌లో చర్చనీయాంశం
- సర్వే డ్యూటీలు వేయడంపై ఎస్ఎఫ్ఏల అభ్యంతరం

కుత్బుల్లాపూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంటసర్కిళ్ల పరిధిలో బుధవారం కులగణన సమగ్రసర్వే ప్రారంభమైంది. వివిధ శాఖల సిబ్బంది, అధికారులు కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల ఉపకమిషనర్‌లు వడ్డేపల్లి నర్సింహ్మా, మల్లారెడ్డిల ఆదేశాల మేరకు ప్రభుత్వం అందించిన ప్రశ్నావళితో కూడిన పత్రాలను తీసుకుని ప్రజల వద్దకు వెళ్లారు. మొదటిరోజు ఇళ్లను గుర్తించి స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని చేపట్టారు. కొన్ని చిన్నచిన్న అవాంతరాలు తప్ప సర్వే దాదాపు పూర్తిస్థాయిలో ప్రారంభమైంది.


గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్టలో సర్వేను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జగన్


సుభాష్‌నగర్ డివిజన్‌లో సర్వేను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమలతా సురేష్‌రెడ్డి


సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు జి.ఐలయ్యగౌడ్

కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో పని చేస్తున్న కొందరు ఎస్ఎఫ్ఏలు మాకు డ్యూటీలు వేయడం ఏమిటని ఉప కమిషనర్, ఏఎంహెచ్ఓను ప్రశ్నించారు. ఉదయం 5 గంటలకు విధులకు వచ్చి సాయంత్రం 7 గంటల వరకు విధులు నిర్వహించాలంటే మావల్ల కాదాని తెగేసి చెప్పారు. దీంతో కమిషనర్ ఇది ఉన్నతాధికారుల ఆదేశాలని, తప్పకుండా పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. అంతేకాక కొందరు అసలు చదువుకోని వారికి కూడా డ్యూటీలు వేశారని ఏవిధంగా వారు సర్వే చేస్తారని ప్రశ్నించారు. అలాంటి వారు ఉంటే తప్పకుండా గుర్తించి సర్వే నుంచి మినహాయిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఆదర్శ ఫౌండేషన్ చిన్నారులు


చిన్నారులకు బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న పద్మరాగ రెస్టారెంట్ డైరెక్టర్ సంతోష్‌రెడ్డి

దుండిగల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కొంపల్లి డీమార్ట్ వద్ద పద్మరాగ రెస్టారెంట్, బ్యాంక్వెట్ హాల్‌ను ఆదర్శ ఫౌండేషన్‌కు చెందిన అనాథ పిల్లలు ప్రారంభించారు. అనంతరం పద్మరాగ రెస్టారెంట్ డైరెక్టర్ సంతోష్‌రెడ్డి చిన్నారులకు బ్యాగ్‌లు, యూనిఫామ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు రెస్టారెంట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని, భోజన ప్రియులకు రుచికరమైన ఆహారాన్ని అందించడమే మా ధ్యేయమని అన్నారు.

ప్రపంచ రికార్డును సాధించిన సమన్వితరెడ్డి


సమన్వితరెడ్డికి అవార్డు పత్రాలను అందజేస్తున్న రమణారావు

దుండిగల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రివర్స్ స్కేటింగ్ చేస్తూ, కూచిపూడి నాట్య ప్రదర్శనలో కట్ట సమన్వితరెడ్డి ప్రపంచ రికార్డు సాధించింది. కొంపల్లిలో జరిగిన 10వ ప్రపంచ రికార్డుల్లో రివర్స్ స్కేటింగ్ చేస్తూ కూచిపూడి నాట్య ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. ఈ అవార్డు పత్రాలను భారత వరల్డ్ రికార్డు ఫౌండర్ కేవీ రమణారావు, విశ్వ గురువు వరల్డ్ రికార్డు సీఈఓ సత్యవేలు రాంబాబు, పినర్స్ స్కూల్ ప్రిన్సిపల్ అన్మషాహిదా, ప్రపంచ వరల్డ్ సమన్వయకర్త నాట్య గురువు నామాల రవికుమార్ ఆమెకు అందజేశారు.

కుటుంబ సమగ్రసర్వేకు సహకరించాలి

నిజాంపేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే కార్యక్రమాన్ని నిజాంపేట్ కార్పొరేషన్ 12వ డివిజన్‌లో మేయర్ కొలన్ నీలారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీలు మున్సిపల్ అధికారులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ నీలారెడ్డి మాట్లాడుతూ ఈ సర్వేకు వచ్చిన సిబ్బందికి ప్రజలు వివరాలను తెలియజేయాలని సూచించారు. ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని బట్టి రానున్న రోజుల్లో ప్రభుత్వం పలు పథకాలకు శ్రీకారం చుట్టనున్నదన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్‌కు చెందిన పలువిభాగాల అధికారులు, సిబ్బంది, డివిజన్‌స్థాయి నాయకులు పాల్గొన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న మేయర్ కొలన్ నీలారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ

దుండిగల్ మున్సిపాలిటీలో

సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణలు మల్లంపేట 25వ వార్డు ప్రణీత్ ప్రణవ్ లీఫ్‌లో బుధవారం సమగ్ర సర్వేను ప్రారంభించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వేకు ప్రజలంతా సహకరించాలని, సర్వే కోసం ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్లకు వివరాలు అందించాలని కోరారు. అనంతరం సర్వే నిర్వహించిన ఇంటి వద్ద సర్వే పూర్తి అయినట్లుగా స్టిక్కర్‌ను వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్, సిబ్బంది ఉన్నారు.


సర్వే అనంతరం ఇంటిగోడకు స్టిక్కర్ అతికిస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ


ప్రగతినగర్ 6వ వార్డులో ప్రజల నుంచి సర్వే వివరాలు తీసుకుంటున్న సిబ్బంది. - నిజాంపేట్ (ఆంధ్రజ్యోతి)

నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని వినతి

దుండిగల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ సర్వే నంబరు 120 కాలనీలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 59 జీఓ కింద ప్రభుత్వానికి డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలాలకు, పాత ఇళ్ల స్థలాల్లో నూతన నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు మంజూరు చేయాలని 120 కాలనీవాసి ఎండీ హాజీ బుధవారం దుండిగల్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం పేదల సౌకర్యార్థం 58, 59 జీవోలను ప్రవేశపెట్టిన విధానాన్ని గుర్తు చేశారు. 58 జీఓ కింద పట్టాలు పొందిన వారికి, 59 జీఓ కింద రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారికి అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని హాజీ తన ఆవేదనను కమిషనర్‌కు వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని మరోసారి పరిశీలించి, పేద ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.


కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న హాజీ

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : కూన

గాజులరామారం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ ఆదర్శనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆయనను కలిసి వినతి పత్రం అందించారు. కాలనీలో సీసీ రోడ్డులు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయని ఆయనకు వివరించారు. దీంతో సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శివశంకర్, దయాకర్, కృష్ణ, బాపిరెడ్డి, మల్లారెడ్డి.


శ్రీశైలంగౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆదర్శనగర్ కాలనీ వాసులు

ఉత్తర హైదరాబాద్‌కు మెట్రో రైలు విస్తరించాలి

దుండిగల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఉత్తర హైదరాబాద్‌కు మెట్రో రైలును విస్తరించాలని బీజేపీ నాయకులు, మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఉత్తర హైదరాబాద్‌లో ఉన్న నాలుగు మార్గాలైన బాలానగర్, షాద్‌నగర్, సూరారం, గండిమైసమ్మ, బోయినపల్లి, సుచిత్రా, కొంపల్లి, మేడ్చల్, జూబ్లీహిల్స్, అల్వాల్, తూముకుంటలకు మెట్రో క్యారిడార్‌ను పొడిగిస్తే వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు, అలాగే బాలానగర్, జీడిమెట్ల, కాజీపల్లి, మేడ్చల్, షామీర్‌పేటలోని పారిశ్రామికవాడ, మల్లారెడ్డి యూనివర్సిటీ, దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమి, హకీంపేట ఎస్ఎస్‌బిలకు లాభం చేకూరుతుందన్నారు. నార్త్ హైదరాబాదే కాకుండా ఉత్తర తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మెట్రో క్యారిడార్లను పెంచాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్‌జిల్లా ఇన్‌చార్జ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, అనీల్, కాంతారావు, విక్రమ్‌రెడ్డి, సూర్యారావు, విష్ణేశ్వర్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


మెట్రో ఎండీ ఎన్‌వీఎస్.రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తెగిపోయిన చేతిని అతికించిన అపోలో వైద్యులు

- ఈ తరహా శస్త్రచికిత్స తెలుగు రాష్ట్రాల్లో మొదటిది


పేషెంట్ పవన్‌కుమార్‌తో వైద్యులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రమాదంలో తెగిపోయిన యువకుడి చేతిని అతికించారు అపోలో వైద్యులు. మైక్రోవాస్కులర్ రీప్లాంటేషన్ శస్త్రచికిత్స చేసి చేతిని అతికించి పూర్వస్థితికి తీసుకొచ్చారు. ఈ తరహా పెద్ద ప్రాక్సిమల్ లింబ్ రీఅటాచ్‌మెంట్ చేయడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారని వైద్యులు తెలిపారు. బుధవారం అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ జీఎన్ బండారి సర్జరీ వివరాలు వివరించారు. మంచిర్యాలకు చెందిన ఏ. పవన్‌కుమార్(32) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా డీసీఎం డోర్ కుడిచేయి కంకణానికి తగలడంతో చేయి మోచేతి వరకు తెగిపోయింది. తెగిన చేతిని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి పవన్‌కుమార్‌ను తీసుకొని బంధువులు అపోలోకి గతనెల 11వ తేదీన వచ్చారు. వైద్యులు 8 గంటలపాటు శస్త్రచికిత్స చేసి విరిగిన చేతిని విజయవంతంగా అతికించారని బండారి వివరించారు. ఈ సందర్భంగా పేషెంట్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. విరిగిపోయిన చేతిని ఆస్పత్రి వైద్యులు అతికించడంతో సంతోషంగా ఉన్నాను. సమావేశంలో ఆస్పత్రి సీఈవో తేజస్విరావు, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలుంటే తెలియజేయండి

- ఏఈ చైతన్య భార్గవ్

గాజులరామారం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గాజులరామారం విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని ఏఈ చైతన్య భార్గవ్ అన్నారు. ఈ నెల సీపీఎం పార్టీ నాయకులు గాజులరామారం డివిజన్‌లోని రోడామేస్త్రీనగర్-బిలో విద్యుత్, రీడింగ్‌లో సమస్యలున్నాయని ఏఈకి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన బుధవారం పర్యటించి, ఎక్కడెక్కడ విద్యుత్ సమస్యలున్నాయో తెలుసుకొని ఉన్నతాధికారులకు తెలియజేశారు. అనంతరం లోటల్టేజి సమస్యలున్నాయని, అందుకు నూతనంగా విద్యుత్ లైన్‌లను ఏర్పాటు చేస్తామని, మీటర్ రీడింగ్‌ను ఉదయం వేళల్లో తీసేలా చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే విద్యుత్ సమస్యలుంటే ఎస్ఓసీ గాజులరామారం ఫోన్ నెంబర్ 9490153560ను సంప్రదించి సమస్యలు తెలియజేయాలన్నారు.


రోడా మేస్త్రీ నగర్-బిలో పర్యటించిన ఏఈ చైతన్య భార్గవ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకే టికెట్లు కేటాయించాలి

- మాజీ ఎంపీ ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న రెండు పట్టభద్రులు, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీ అభ్యర్థులకే టికెట్లు కేటాయించాలని మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఏ పార్టీ అయితే బీసీలకు ఎమ్మెల్సీ టికెట్లు ఇవ్వదో ఆ పార్టీని ఎన్నికల్లో ఓడిస్తామని ఆయన హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు భూపేష్‌సాగర్ సంయుక్త ఆధ్వర్యంలో బీసీ సంఘాల కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ... కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, రెండు పట్టభద్రుల నియోజకవర్గాలు నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్నాయని, ఈ మూడు నియోజకవర్గాలలో బీసీ అభ్యర్థులనే పోటీలో నిలపాలని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలకు ఆయన విజ్ఞప్తి చేశారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలను పూర్తిగా విస్మరించాయని, కనీసం ఎమ్మెల్సీ ఎన్నికల్లో అయినా బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని ఆయన కోరారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కల్పనకై రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు టి.రాజ్‌కుమార్, వేముల రామకృష్ణ, జి. మల్లేష్‌యాదవ్, జి.అనంతయ్య, మోదీ రాందేవ్, జోషి రాఘవ, భాస్కర్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, సి.రాజేందర్, రామకృష్ణ, జి.అనంతయ్య తదితరులు